క్లుప్తంగా...

తూముకుంట మున్సిపాలిటీ కౌన్సిల్ సమావేశం

శామీర్‌పేట్: తూముకుంట మున్సిపాలిటీ కౌన్సిల్ సాధారణ సమావేశం మంగళవారం చైర్మన్ కారంగుల రాజేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మున్సిపాలిటీలోని వార్డుల్లో పలు అభివృద్ధి పనులను చేపట్టేందుకు రూ.1.66 కోట్ల నిధులను మంజూరు చేసేందుకు సభ్యులు తీర్మానం చేశారు. వర్షాకాలంలో తలెత్తే ఇబ్బందుల దృష్ట్యా అత్యవసర సమయాల్లో అందుబాటులో ఒక ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ టీమ్‌తో పాటు కంట్రోల్ రూం ఏర్పాటుకు చర్చించినట్లు కమిషనర్ జైత్‌రాం నాయక్ ఓ పత్రిక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ వాణీవీరారెడ్డి, కౌన్సిల్ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు, పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఏసీఈ అసోసియేట్ ప్రొఫెసర్ కవితకు డాక్టరేట్



ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ మండలం అంకుషాపూర్ ఏసీఈ ఇంజినీరింగ్ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ కవిత సొప్పరికి గౌరవ డాక్టరేట్ లభించింది. నగరంలోని జేఎన్‌టీయూ యూనివర్సిటీలో సీవీఆర్ కళాశాల ఇంజినీరింగ్ ప్రొఫెసర్ డాక్టర్ ఎన్.సుభాష్‌చంద్ర పర్యవేక్షణలో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగంలో పరిణామాత్మక అల్గారిథమ్‌లను ఉపయోగించి 'డిజిటల్ వాటర్ మార్కింగ్' అంశంపై పరిశోధనకు గాను జేఎన్టీయూ ఆమెకు గౌరవ డాక్టరేట్ అందజేసింది. ఆమె మాట్లాడుతూ డాక్టరేట్ తన తల్లిదండ్రులు యాదగిరి, సత్యభామకు అంకితమన్నారు.

రైల్వే వంతెన ఆలస్యంతో ప్రయాణికులకు నరకం

ఘట్‌కేసర్: తెలంగాణ రోడ్డు, భవనాల శాఖ డీఈ శ్రీనివాసమూర్తిని ఘట్‌కేసర్ అఖిలపక్ష నాయకులు మేడ్చల్ కలెక్టరేట్‌లోని ఆయన కార్యాలయంలో మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా ఘట్‌కేసర్ రైల్వే వంతెన ఆలస్యం కావడంతో ప్రయాణికులు, స్థానికులకు ఎదురవుతున్న సమస్యలు వివరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యాదగిరియాదవ్, బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు హనుమాన్, టీజేఎస్ నాయకుడు లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఆంజనేయులు, సీపీఎం నాయకుడు యాదయ్య, సీపీఐ నాయకుడు ఈశ్వర్ పాల్గొన్నారు.

ఘనంగా ఎల్లమ్మ బోనాలు



మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లిలో మంగళవారం బోనాల వేడుకలు ఘనంగా జరిగాయి. గ్రామంలోని ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రాములు, కౌన్సిలర్లు మల్లిఖార్జున్ ముదిరాజ్, బాలరాజ్, నాయకులు సంజీవగౌడ్, సురేందర్, నాగరాజు ముదిరాజ్, అశోక్, సాయి, నర్సింగ్‌యాదవ్, జగన్, నరేందర్, క్రిష్టారెడ్డి, రాము యాదవ్, క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

కీసర: నాగారం, భోగారం, కీసర, యాద్గార్‌పల్లి, చీర్యాల ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు తీన్మార్ మల్లన్న సొసైటీ ద్వారా నోట్‌బుక్స్‌ను మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో తీన్మార్ మల్లన్నతో పాటు క్యూన్యూస్ రిపోర్టర్ సుదర్శన్, సొసైటీ సభ్యులు కర్రె గణేష్, వెంకట్‌రెడ్డి, పరమేష్, భాను చందర్, అశోక్, సుమన్, నవీన్, సందీప్, కమలాకర్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

రావల్‌కోల్ బోనాల వేడుకలో వాగ్వాదం

మేడ్చల్‌రూరల్: మేడ్చల్ మండలంలోని రావల్‌కోల్ గ్రామంలో సోమవారం బోనాల వేడుకలు గొడవకు దారితీశాయి. బోనాల వేడుకలో పాల్గొన్న తమను ఓ వర్గం వారు అవమానించారంటూ మరో వర్గం వారు మేడ్చల్ పోలీసులు ఆశ్రయించారు. వివరాలు.. ఆషాఢమాస బోనాల సందర్భంగా రావల్‌కోల్ గ్రామంలో ఆది, సోమవారం బోనాల వేడుకలు నిర్వహించారు. ఆదివారం బోనాల వేడుక నిర్వహించగా సోమవారం గ్రామంలోని మర్రి మైసమ్మ అమ్మవారి బోనాల వేడుక నిర్వహించారు. ప్రతి సంవత్సరం గ్రామంలోని కొన్ని కాలనీల కులాల వారు అమ్మవారికి బోనాలు సమర్పిస్తుంటారు. కాగా అమ్మవారి ఆలయం వద్ద బోనాల సమర్పణ సమయంలో తలెత్తిన చిన్నపాటి గొడవ కులాల మధ్య చిచ్చురేపింది. బోనాల ప్రదక్షిణలు మధ్యలో ఉన్నాయని పూర్తయ్యే వరకు వేచి ఉండి అనంతరం ప్రదక్షిణలు చేయాలని కొంతమంది చెప్పడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. మంగళవారం ఓ వర్గం వారు మేడ్చల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో గ్రామ సర్పంచ్ మహేందర్, వైస్ ఎంపీపీ వెంకటేష్, గ్రామ పెద్దలు సముదాయించారు.

అడుగడుగునా ఆటంకాలే..!



మినీస్టేడియం

అదిగో సమస్యలు పరిష్కరిస్తాం.. ఇదిగో పనులు మొదలు పెట్టాం.. చకచకా పూర్తి చేస్తాం.. ప్రజలందరికీ సౌకర్యాలు కల్పిస్తాం.. ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తాం.. అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తాం.. ఒకటా రెండా ఎన్నెన్ని హామీలో.. పనులు మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారుతున్నాయి. మేడ్చల్ మినీ స్టేడియం దుస్థితి ఏళ్లు గడుస్తున్నా.. మంత్రులు హామీలు ఇచ్చినా పూర్తికాకపోవడంతో యువత, క్రీడాకారులు పెద్దఎత్తున ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- ఏళ్లుగా అందుబాటులోకి రాని మినీ స్టేడియం
- గతేడాది మంత్రి కేటీఆర్‌తో ప్రారంభోత్సవం
- ఆ తర్వాత వసతులు కల్పించడంలో నిర్లక్ష్యం
- ప్రస్తుతం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా..
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న క్రీడాకారులు, ప్రజలు


మేకల, గొర్రెల దొడ్డిగా మారిన గ్యాలరీ కింది భాగం



మేడ్చల్: మేడ్చల్ మినీ స్టేడియాన్ని పరిశీలిస్తే అందరికీ సులువుగా అర్థం అవుతుంది. దాదాపు 20 ఏళ్ల క్రితం శంకుస్థాపనకు నోచుకొని గతేడాది హడావుడిగా పనులు ప్రారంభమయ్యాయి. అయినా యువత, క్రీడాకారులకు అందుబాటులోకి రాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మేడ్చల్ చెక్‌పోస్ట్ వద్ద పారిశ్రామికవాడలో రెవెన్యూ శాఖ మంత్రిగా ఉన్న సమయంలో దేవేందర్‌గౌడ్ శంకుస్థాపన చేశారు. ఏ ముహూర్తాన శంకుస్థాపన చేశారో గానీ ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడినా స్టేడియం రాత మాత్రం మారలేదు. ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని గతేడాది జూన్ 15న ప్రారంభమైంది. 5 ఏళ్లుగా పూర్తి కాలేదంటే కోర్టు సమస్యలు, భూవివాదాలు ఉన్నాయనుకుంటే పొరపాటే.. కేవలం నిధుల కొరత, ఎమ్మెల్యేల నిర్లక్ష్యం కారణంగా స్టేడియం పనులు అప్పుడప్పుడూ ముందుకు సాగుతూ ఏళ్ల తర్వాత పూర్తయింది.

పట్టణ ప్రగతిలో ప్రారంభం..

మేడ్చల్ ప్రజల కలగా ఉన్న మినీ స్టేడియం గత సంవత్సరం జూన్ 15న మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. పట్టణ ప్రగతిలో భాగంగా స్టేడియానికి హడావుడిగా మరమ్మతులు చేసి గ్రౌండ్‌ను చదును చేసి పాతవాటికి రంగులు వేసి తెలంగాణ క్రీడా ప్రాంగణంగా మార్చి ప్రారంభించారు. అట్టహాసంగా ప్రారంభించినా ఆ తర్వాత వసతులు కల్పించకపోవడంతో అది నిరుపయోగంగా మారింది.

మంత్రి కేటీఆర్ చెప్పినా బాగుపడలే..

స్టేడియాన్ని ప్రారంభించిన మంత్రి కేటీఆర్ నాటి ప్రారంభోత్సవ సభలో స్టేడియం నిర్మాణం తీరును తప్పుబట్టారు. నిర్మించే తీరు ఇది కాదని మంత్రి మల్లారెడ్డిపై అసహనం వ్యక్తం చేశారు. మంత్రి మల్లారెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్, అధికారులు ఒకసారి సిరిసిల్లకు వెళ్లి అక్కడ నిర్మించిన మినీ స్టేడియంను పరిశీలించి మోడల్‌గా నిర్మించాలని సూచించారు. నిధులు తాను మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. మంత్రి కేటీఆర్‌ను తన ఆరాధ్య దైవంగా భావిస్తానని నిత్యం గొప్పలు చెప్పుకునే మంత్రి మల్లారెడ్డి తన బాస్ మాటలకు ఏ మాత్రం విలువ ఇవ్వలేదు. సిరిసిల్లకు వెళ్లింది లేదు.. ఆయన చూసింది లేదు. ఆయన బాటలోనే ఆయన అనుచరులు నడిచారు. దీంతో స్టేడియం పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న విధంగా తయారైంది.

తాగుబోతులకు అడ్డాగా..

స్టేడియం ఆవరణంతా పిచ్చి మొక్కలతో నిండిపోయింది. గ్రౌండ్ ఏ మాత్రం ఉపయోగకరంగా లేకుండా పోయింది. గ్యాలరీకి రంగులు వేసినా చెత్తమయంగా మారింది. గ్యాలరీ వెనుక భాగం గొర్రెలు, మేకలకు దొడ్డిగా మారింది. ఆవరణలో ఏర్పాటు చేసిన భవనం వృథా ఉండిపోయి పాలకుల తీరును వెక్కిరిస్తోంది. పట్టణ ప్రగతిలో ఏర్పాటు చేసిన బోర్డు సైతం చిరిగిపోయింది. ఆట స్థలంలో పిచ్చి మొక్కలు, రాళ్లు, ఇలా అందవిహీనంగా మారింది. పాలకులు తమ గొప్పలకు పోయి హడావుడిగా ప్రారంభించిన స్టేడియాన్ని పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. అసంపూర్తిగా ఉండటం, రక్షణ లేకపోవడంతో స్టేడియం ఆవరణ అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారింది. అధికంగా కార్మికులు ఉండే ప్రాంతంలో మినీ స్టేడియం ఉండటంతో తాగుబోతులు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిపోయింది.

కలెక్టర్ ఆదేశాలతో విచారణ


రాంపల్లిలో విచారణ చేపడుతున్న డీఆర్‌డీఏ అధికారి పద్మజారాణి తదితరులు

కీసర: నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీల నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయానికి అందిన ఫిర్యాదు మేరకు జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్ ఆదేశాల మేరకు మంగళవారం డీఆర్‌డీఏ అధికారి పద్మజారాణి విచారణ చేపట్టారు. ఈ మేరకు నాగారం మున్సిపాలిటీ రాంపల్లిలో సుమారు 15 ఎకరాల్లో వెలిసిన ఎలిఫెంట్ వెంచర్‌పై స్థానిక కౌన్సిలర్ పంబాల సరితారమేష్‌గౌడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. సర్వే నెంబర్ 758, 759లో హెచ్ఎండీఏ అనుమతి లేకుండా వెలిసిన లేఅవుట్‌లో సుమారు రూ.25 లక్షల మున్సిపల్ నిధులు వెచ్చించి డ్రైనేజీ పనులు చేపట్టాలని మున్సిపల్ పాలకవర్గం తీర్మానించనాన్ని వ్యతిరేకిస్తూ కౌన్సిలర్ సరితారమేష్ ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే.. మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి, వైస్ చైర్మన్ మల్లేష్‌యాదవ్, కౌన్సిలర్ నాగేష్‌గౌడ్ రియల్టర్‌తో లోపాయికారి ఒప్పందం చేసుకొని మున్సిపల్ నిధులు వెచ్చించి అక్రమ లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలు చేసుకున్న వారికి డ్రైనేజీ పనులు చేపట్టేందుకు యత్నిస్తున్నారని సరితారమేష్ డీఆర్‌డీఏ అధికారి పద్మజారాణికి వివరించారు. నిబంధనల మేరకు ఇళ్ల నిర్మాణాలు తీసుకొని కాలనీ ఏర్పాటైనందున స్థానిక కౌన్సిలర్ అభ్యర్థన మేరకు మున్సిపల్ పాలకవర్గం సమావేశంలో అందరి ఆమోదంతో సుమారు రూ.25 లక్షల మున్సిపల్ నిధులతో కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేపట్టాలని నిర్ణయించినట్లు కమిషనర్ వాణీరెడ్డి విచారణ అధికారి డీఆర్‌డీఏ పద్మజారాణికి వివరించారు. పూర్తి నివేదికను ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు డీఆర్‌డీఏ అధికారి పద్మజారాణి తెలిపారు.

క్షేత్రస్థాయిలో డీఆర్‌డీఏ విచారణ

ఇదిలా ఉండగా దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని కుందన్‌పల్లిలోని ఓ వెంచర్‌లోని పార్కుకు సంబంధించి మున్సిపల్ ఆధ్వర్యంలో ప్రకృతివనంలో నాటిన మొక్కలను తొలగించడంతో పాటు పనులు చేపట్టేందుకు మున్సిపల్ అధికారులకు అడ్డు తగులుతున్న కొందరి వ్యక్తులకు సంబంధించి వచ్చిన ఫిర్యాదుతో క్షేత్రస్థాయిలో డీఆర్‌డీఏ విచారణ చేపట్టారు.

రైల్వే వంతెన పనులను త్వరగా పూర్తి చేయాలి

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్‌లో నిర్మిస్తున్న రైల్వే వంతెన పనులు త్వరగా పూర్తి చేయాలని రాష్ట్ర రోడ్డు, భవనాల శాఖ సీఈ సతీశ్‌కుమార్, డీఈ శ్రీనివాసమూర్తిని వారి కార్యాలయంలో మున్సిపల్ చైర్ పర్సన్ పావనీయాదవ్ మంగళవారం కలిశారు. పాత కాంట్రాక్టర్‌ను తొలగించామని, ఈ నెల 21న నూతన టెండర్ ప్రక్రియ ముగియగానే వంతెన పనులు ప్రారంభించి త్వరగా పూర్తి చేయిస్తామని హామీ ఇచ్చినట్లు చైర్ పర్సన్ పేర్కొన్నారు.

చోరీలకు పాల్పడుతున్న నిందితుడికి రిమాండ్


జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడిస్తున్న డీఐ శ్రీనివాస్

జవహర్‌నగర్: దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడిని రిమాండ్‌కు తరలించిన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. జవహర్‌నగర్ సీఐ సీతారాం, డీఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ దేవరయాంజాల్‌కు చెందిన జంగలం చందు అలియాస్ రమేష్(36) లారీ డ్రైవర్. జల్సాలకు అలవాటుపడి డబ్బులు సంపాదించాలని అనుకున్న చందు తాళాలు వేసి ఉన్న ఇళ్లను టార్గెట్ చేసుకొని చోరీలు చేసేవాడు. కొంత కాలంగా జవహర్‌నగర్, కీసర, మేడిపల్లి, నాచారం పోలీస్‌స్టేషన్ల పరిధిలో దొంగతనాలు చేసి జైలుకు వెళ్లివచ్చాడు. పక్కా సమాచారం అందుకున్న జవహర్‌నగర్ పోలీసులు మంగళవారం చందును అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి 16 తులాల బంగారం, కిలో వెండిని స్వాధీనం చేసుకుని చందూని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

ఇద్దరు నేరస్తుల అరెస్టు

పోచారం: అన్నోజిగూడలో వాహనాలు తనిఖీ చేస్తుండగా ఇద్దరు నేరస్తులు పోచారం పోలీసులకు చిక్కారు. సీఐ అశోక్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. జనగాం జిల్లాలోని కుందర గ్రామానికి చెందిన మంద రాజు(36) ఈసీఐఎల్ కంపెనీలో కూలీగా పనిచేస్తూ చర్లపల్లిలో ఉంటున్నాడు. ఈ నెల 15న జనగాం నుంచి కీసర మండల పరిధిలోని ఆర్ఎల్ నగర్‌కు ఆర్టీసీ బస్సులో వస్తున్నాడు. యమ్నంపేట్ చౌరస్తా వద్ద బస్సు నుంచి దిగాల్సిన అతను రాత్రి 11 గంటల సమయంలో అన్నోజిగూడ బస్టాప్‌లో దిగాడు. అక్కడి నుంచి నడుచుకుంటూ యమ్నంపేట్ చౌరస్తా వెళ్తున్నాడు. ఆటోలో వచ్చిన వ్యక్తులు తాము చర్లపల్లి వెళ్తున్నామని రాజును ఎక్కించుకున్నారు. యమ్నంపేట్ ఫ్లైఓవర్ వద్ద అతడిని పొదల్లోకి తీసుకెళ్లి ఫోన్‌తో పాటు రూ.5 వేలు గుంజుకొని ఘట్‌కేసర్ వైపు పారిపోయారు. బాధితుడు పోచారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మంగళవారం అన్నోజిగూడ వద్ద మహ్మద్ ఇమామ్(22), కొమ్మెర పవన్(23)ను పోలీసులు అరెస్టు చేశారు. మహబూబాబాద్ జిల్లా నడివాడ గ్రామానికి చెందిన ఇమామ్, ఖమ్మంలోని వడ్డెర బస్తీకి చెందిన పవన్‌లు ఘట్‌కేసర్‌లో ఉంటున్నట్లు గుర్తించారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి


మంత్రి మల్లారెడ్డికి వినతి అందజేస్తున్న పంచాయతీ కార్మికులు, జేఏసీ నాయకులు

ఘట్‌కేసర్: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించి సమ్మెను విరమింపజేయాలని మంత్రి మల్లారెడ్డిని ఆయన నివాసంలో కార్మికులు, కార్మిక జేఏసీ నాయకులు మంగళవారం వినతి అందజేశారు. కనీస వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ, బోనస్, పండగ, జాతీయ సెలవులు ఇవ్వాలని మంత్రికి అందజేసిన లేఖలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కార్మికుల సమస్యలపై సీఎం కేసీఆర్‌ను సచివాలయంలో కలిసి వివరిస్తానని, పరిష్కారం అయ్యేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర ఉప కార్యదర్శి నరసింహ, జేఏసీ నాయకులు ఏఐటీయూసీ జయచంద్ర, సీఐటీయూ శ్రీనివాస్, ఐఎఫ్టీయూ శివబాబు, జిల్లాలోని గ్రామ పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

ప్లాట్ల బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటం

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ సర్వే నెంబర్-613, 614లో కేసీఆర్ కూరగాయల మార్కెట్ పేరుతో తమ ప్లాట్లను లాక్కున్నారని తమకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చిన మంత్రి మల్లారెడ్డి తమకు మోసం చేశారని ఆరోపిస్తూ ప్లాట్ల బాధితుల నిరసన దీక్ష కార్యక్రమం కొనసాగుతోంది. దీక్షకు మద్దతుగా మంగళవారం కాంగ్రెస్ నాయకులు, ఎమ్మార్పీఎస్ నాయకులు హాజరై మాట్లాడారు. పేద ప్రజల భూములను మంత్రి మల్లారెడ్డి లాక్కొని వ్యాపారం చేస్తున్నారని ఆరోపించారు. ప్లాట్ల బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ఎమ్మార్పీఎస్ నాయకులు, ప్లాట్ల బాధితులు తదితరులు పాల్గొన్నారు.


జవహర్‌నగర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న బాధితులు

మూడు పంటలకు విద్యుత్ ఇస్తున్నాం..

రాష్ట్ర కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి



శామీర్‌పేట్: మూడు పంటలకు విద్యుత్ సరఫరా చేసే ప్రభుత్వం తమదే అని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. మంగళవారం శామీర్‌పేట మండలం, లాల్‌గడి మలక్‌పేటలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో అసంపూర్తిగా ఉన్న రోడ్లు, యూజీడీ పనులను వెంటనే చేపట్టేల చర్యలు తీసుకుంటానని తెలిపారు. గ్రామంలోని ముదిరాజ్ భవనానికి రూ.10 లక్షలు, యాదవసంఘం భవనానికి రూ.3 లక్షలు తన సొంత నిధులు ఇస్తానని హామీ ఇచ్చారు. మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంతో పాటు దేశంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు దివాళా తీశాయన్నారు. కాంగ్రెస్ హయాంలో రైతులు కరెంట్ కష్టాలతో ఆత్మహత్యలు చేసుకున్నారని, ప్రస్తుతం రైతులు సుఖంగా జీవిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎల్లుబాయి, జెడ్పీటీసీ అనిత, లాల్‌గడి మలక్‌పేట సర్పంచ్ వనజశ్రీనివాస్‌రెడ్డి, పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులను కలిసికట్టుగా ఎదుర్కోవాలి

అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య



సాక్షి, మేడ్చల్ జిల్లా: వర్షాకాలంలో దోమలు, ఈగలు, కీటకాలు తదితర వాటితో సంక్రమించే వ్యాధులు, నీటి ద్వారా సంక్రమించే వ్యాధుల వ్యాప్తిని అరికట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా సమన్వయ కమిటీ సమావేశం (డీసీసీఎం)లో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. వర్షాకాలం సీజన్‌లో ప్రబలే మలేరియా, డెంగీ, ఫైలేరియా, టైఫాయిడ్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. సీజనల్ వ్యాధులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు స్థానిక అంగన్‌వాడీలు, స్వయం సహాయక బృందాల సహకారంతో పాటు జిల్లా, మండల పరిషత్‌ల సమన్వయంతో ముందస్తు రోగ నిర్ధారణ, పూర్తిస్థాయి వైద్య చికిత్స అందించడం ద్వారా ముందడుగు వేయాలన్నారు. సమావేశంలో వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయండి



సాక్షి, మేడ్చల్ జిల్లా: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 20 వరకు అల్బెండజోల్ మాత్రలను అందరికీ పంపిణీ చేయడం ద్వారా నులిపురుగుల నిర్మూలన లక్ష్య సాధనకు ముందుకెళ్లాని జిల్లా అదనపు కలెక్టర్(లోకల్ బాడీస్) అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన జిల్లా టాస్క్‌ఫోర్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రీస్కూల్, పాఠశాల వయస్సు కలిగిన పిల్లల ఆరోగ్యం, శ్రేయస్సు కోసం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా అల్బెండజోల్ మాత్రలను వారికి అందజేసి విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

టెక్నాలజీని వాడుకుంటే ఉజ్వల భవిష్యత్


ముఖ్య అతిథితో విద్యార్థులు, అధ్యాపకులు

ఘట్‌కేసర్: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై నైపుణ్యం సాధిస్తే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని సర్వీస్ నౌ సీనియర్ ప్రొడక్ట్ అనలిస్ట్ గీతాజలిశ్రీవాత్సవ్ అన్నారు. వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీ(ఏయూ)లో మంగళవారం డాటా సైన్స్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 'డాటా యూఎమ్' క్లబ్ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డాటా యూఎమ్ క్లబ్‌ల వల్ల సాంకేతిక నైపుణ్యంతో పాటు వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాలు మెరుగుపర్చుకోవడానికి దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో డీన్స్, ప్రొఫెసర్లు విజయ్‌కుమార్, విష్ణుమూర్తి, శ్రీదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

డబుల్ ఇళ్ల పేరుతో మోసం


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

మేడ్చల్‌రూరల్: పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించి ఇస్తానని చెప్పి గద్దెనెక్కిన సీఎం కేసీఆర్ పేదలకు ఇళ్లు కేటాయించకుండా మోసం చేశాడని బీజేపీ నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ అమరం మోహన్‌రెడ్డి మండిపడ్డారు. మంగళవారం గుండ్లపోచంపల్లిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఒక్క పెంకుటిల్లు లేకుండా చేస్తానని, డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తానని చెప్పి దగా చేసిన కేసీఆర్ ప్రభుత్వాన్ని, కల్వకుంట్ల కుటుంబాన్ని రానున్న ఎన్నికల్లో ప్రగతిభవన్ నుంచి ఫామ్‌హౌస్‌కు పంపడం ఖాయమన్నారు. ఈ సందర్భంగా కరపత్రాలను విడుదల చేశారు. సమావేశంలో కౌన్సిలర్ అమరం సరస్వతి, నాయకులు రవీందర్‌గౌడ్, శ్రీధర్, మహేశ్, విక్రం, నవీన్‌కుమార్ వెంకట్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో గద్దెనెక్కేది బీజేపీనే..

బీజేపీ మండల అధ్యక్షుడు చలువాదీ ప్రవీణ్‌రావు


ప్రతాపసింగారంలోని డబుల్ ఇళ్లను పరిశీలిస్తున్న ప్రవీణ్‌రావు, సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్: కేంద్ర ప్రభుత్వ పథకం ప్రధాన మంత్రి ఆవాస్ యోజన నిధులతో ప్రతాపసింగారంలో నిర్మించిన రెండు పడకల ఇళ్లను బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు చలువాదీ ప్రవీణ్‌రావు ఆధ్వర్యంలో నాయకుల బృందం మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌రావు మాట్లాడుతూ తొమ్మిదేళ్లుగా అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం అర్హులైన పేదలకు రెండు పడకల ఇళ్లను ఇవ్వలేదని, కేంద్ర ప్రభుత్వ నిధులతో పూర్తిచేసిన ఇళ్లను కేటాయించడంలో నిర్లక్ష్యం చేస్తోందన్నారు. ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ బీజేపీకి మంచి పేరు వస్తుందనే భయంతోనే పూర్తి చేసిన రెండు పడకల ఇళ్లను ఇవ్వడం లేదని, పూర్తి చేసిన ఇళ్లను పేదలకు అందజేయకపోవడంతో ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో రామోజీ, రాజశేఖర్‌రెడ్డి, శ్రీశైలం, ప్రభంజన్, పవన్‌కుమార్, రఘు, శివరాజ్‌గౌడ్, వెంకట్రామరాజుగుప్త, బస్వరాజ్, వెంకటేశ్, శివాజీ, ముఖేశ్, సాయికిరణ్, మల్లేశ్ పాల్గొన్నారు.

శ్మశానవాటికల అభివృద్ధికి శంకుస్థాపన


ముస్లిం శ్మశాన వాటికల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన చైర్మన్ చంద్రారెడ్డి

కీసర: నాగారం పురపాలక సంఘ పరిధిలో ముస్లిం శ్మశానవాటికల అభివృద్ధి పనులకు చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాలుగో వార్డు భరత్‌నగర్‌లోని శ్మశానవాటికను రూ.11 లక్షలు, 11వ వార్డు మధురానగర్‌లోని శ్మశానవాటికను రూ.10 లక్షలతో అభివృద్ధి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ బండారి మల్లేష్ యాదవ్, కౌన్సిలర్లు లక్ష్మి, ప్రియాంక, నగేష్, కో ఆప్షన్ సభ్యులు షఫీ, అశోక్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.